క్లుప్తంగా

గృహ నిర్మాణాల లక్ష్యం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ శేషగిరి

సత్యవేడు : మండల పరిధిలో 287 గృహ నిర్మాణాల లక్ష్యం పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ శేషగిరి కోరారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో హౌసింగ్ నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు రూ.60 లక్షలు అదనపు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఏఈ బానుప్రకాష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఊసేలేని స.హ.చట్టం బోర్డు



సత్యవేడులోని ఉపాధి కార్యాలయ భవనం

సత్యవేడు : సత్యవేడు మండలంలోని స్త్రీశక్తి భవనం, ఉపాధి పథకం కార్యాలయాల్లో సమాచార హక్కుచట్టం బోర్డుల ఊసే లేదు. ప్రభుత్వ సమాచార అధికారి, సహాయ సమాచార అధికారి, అప్పిలేట్ అధికారి పేర్లతో సమాచార బోర్డులు లేకపోవడంతో పలు వివరాల కోసం వస్తున్న ప్రజలు ఎవరిని సంప్రదించాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

గంగమ్మకు పొంగళ్లు



అలంకరణలో గంగమ్మ దేవత

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కంచనపుత్తూరు గ్రామంలోని దళితవాడలో నూతనంగా నిర్మించిన గంగమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం దళితులు పొంగళ్లు పెట్టి, అంబళ్లు పోశారు. గంగమ్మ దేవత విగ్రహానికి అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు చేసి, పూలతో అలంకరించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

'పది' సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని అయిదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం వారు నెలవాయి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సప్లిమెంటరీ విద్యార్థుల ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారని, విద్యార్థులు ఫెయిల్ అయిన సబ్జెక్టును చదివిస్తున్నారని తెలిపారు. అలాగే సెలవు రోజుల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకుని చదివిస్తూ, అందరూ ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.

బడి బయట పిల్లలు బడిలో చేరిక



బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని చిన్నపాలేడు, పెద్దపాలేడు గ్రామాల్లోని గిరిజన కాలనీలోని బడి బయట పిల్లలను మంగళవారం ఉపాధ్యాయులు పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్టీ కాలనీలలో ప్రవేశాల ప్రత్యేక నమోదు కార్యక్రమంలో భాగంగా బడి బయట ఉన్న పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పిస్తున్నామన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, ప్రభుత్వం పిల్లల చదువు కోసం కోట్ల రూపాయలను వెచ్చిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, పాల్గొన్నారు.

మే డేను విజయవంతం చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ : మే డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య తెలిపారు. మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగలోని ఈబీసీ కాలనీలో మేడే జయప్రదంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే డే కార్మికుల పోరాటం, ఐక్యతను సూచిస్తుందన్నారు. ప్రజలందరూ పాల్గొని మేడేను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

సేవలు దూరం.. హామీలు మాయం

- గుర్తుకొస్తున్న వలంటీర్ల సేవలు
- వైఎస్సార్‌సీపీ హయాంలో గడప వద్దకే సేవలు
- నేడు సచివాలయ సిబ్బందిపై అదనపు భారం
- ఇబ్బందులు పడుతున్న పల్లె జనం

వరదయ్యపాళెం : ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అన్ని శాఖల అధికారులు అడుగడుగునా వలంటీర్ల సేవలను గుర్తు చేసుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామ, వార్డు వలంటీర్లను ఏర్పాటు చేసి ప్రతి సంక్షేమ పథకాన్ని అవినీతి రహితంగా లబ్ధిదారునికి చేర్చిన ఘనత అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుంది. అడుగడుగునా వాలంటీర్ల సేవలతో ప్రతి సచివాలయంలోనూ పరిపాలన, సంక్షేమ పథకాల అమలు చాలా సులభంగా జరిగేది. అయితే వలంటీర్ల వ్యవస్థపై మొదటి నుంచి విషం చిమ్మిన కూటమి నాయకులు ఎన్నికల సమయంలో మాత్రం వారికి రూ.10 వేల జీతం ఇస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చాక వలంటీర్ వ్యవస్థనే లేకుండా చేశారు. పెరుగుతున్న పనిభారంతో సచివాలయ సిబ్బందితో పాటు ప్రభుత్వ అధికారులు వలంటీర్ల సేవలను గుర్తు చేసుకుంటున్నారు.

సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో 169 గ్రామ పంచాయతీల్లో 1453 మంది గత ప్రభుత్వంలో వలంటీర్లుగా నియమితులై ప్రజలకు సేవ చేసేవారు.

సిబ్బంది తక్కువ.. సర్వేలు ఎక్కువ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ సర్వే అయినా ఏ సంక్షేమ పథకానికి అర్హుల గుర్తింపు లేదా అమలు చేయాలన్నా అతి సులభంగా పనులు చకచకా జరిగిపోయేవని గుర్తు చేసుకుంటున్నారు. కానీ ఇప్పుడు పీ-4 సర్వేతో పాటు ఎంఎస్ఎంఈ సర్వే, పీఆర్ఐ యాప్, జీఎస్‌డబ్ల్యూ యాప్, క్లోరినేషన్ యాప్, వర్క్ ఫ్రమ్ హోమ్ గుర్తింపునకు ఓ యాప్ వంటివి సర్వేలతో పాటు యాప్‌ల నిర్వహణ అధికంగా ఉండటంతో వివిధ శాఖల అధికారుల, సచివాలయ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గతంలో ప్రతి గ్రామ సచివాలయానికి కనీసం 15 మంది వాలంటీర్లు ఉండేవారని ఇప్పుడు సచివాలయంలో కనీసం 10 మంది అధికారులు కూడా లేరని వారు ఆందోళన చెందుతున్నారు. సిబ్బంది లేకుండా సర్వేలు, యాప్‌లు అంటే ఎలా? అంటూ వాపోతున్నారు.

భయభయంగా విధుల నిర్వహణ

కూటమి ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగులు భయభయంగా విధులు నిర్వహిస్తున్నారు. కూటమి నాయకుల ఒత్తిళ్లతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో కొందరు ఉద్యోగాన్ని వదులుకోవాలి లేదా స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకోవాలని ఆలోచిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సరిపడా సిబ్బంది లేకుండా సర్వేలు, యాప్‌లు అంటుంటే ఏం చేయాలో తెలియని సందిగ్ధంలో ఉంటున్నామని కార్యాలయాలు విడిచిపెట్టి కొన్ని రోజుల పాటు గ్రామాల్లో తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు.



వరదయ్యపాళెం మండలంలో సర్వే నిర్వహిస్తున్న గ్రామ వలంటీర్



వరదయ్యపాళెం మండలంలో పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్ (ఫైల్)

మోసగించి తొలగించారు



గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, ఇతర పార్టీలు వలంటీర్ సేవలను తక్కువ చేసి చూపాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏం చేయాలన్నా వాలంటీర్ల సేవలు గుర్తుకొస్తున్నాయి. మేమంతా చేసింది సేవే. కానీ ఏదో చెడ్డ పని చేస్తున్నట్లు టీడీపీ నేతలు అప్పట్లో క్రియేట్ చేశారు. అంతే కాకుండా మోసగించి వలంటీర్లను తొలగించారు. ప్రభుత్వ పథకాలు నిరాటంకంగా అమలు కావాలంటే మళ్లీ వాలంటీర్ల వ్యవస్థ రావాల్సిందే.

– సూర్య, వరదయ్యపాళెం మండలం

పనులు వాయిదా పడుతున్నాయి



సచివాలయానికి సంబంధించి ఏ పని జరగాలన్నా.. ఏం చేయాలన్నా.. వలంటీర్లు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలను అందించేవారు. కానీ ఇప్పుడు ప్రజలంతా సచివాలయానికి వెళ్లి పని చేయించుకోవాల్సిందే. అధికారులు వివిధ సర్వేలు అంటూ గ్రామాల్లోనే తిరుగుతున్నారు. అవసరమైన పనులు చాలా వరకు వాయిదా పడుతున్నాయి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

–జగదీష్, గూడలవారిపాళెం

నోటీస్ బోర్డు

- **నాగలాపురం :** సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం 10 గంటలకు మండలంలోని ద్వారకానగర్ బ్రిడ్జి, వేంబాక్కం వద్ద బ్రిడ్జి నిర్మాణాలకు భూమి పూజ చేయనున్నట్లు మండల అధ్యక్షుడు శ్రీనివాస యాదవ్ తెలిపారు.
- **నారాయణవనం :** బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ గుణశేఖర్ తెలిపారు. మండల కాంప్లెక్స్‌లోని బీసీ కమ్యూనిటీ భవనంలో ఉదయం 9 గంటలకు శిక్షణ తరగతులను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభిస్తారని, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి అవతార మహోత్సవాలు

తిరుపతి కల్చరల్ : అన్నమాచార్య కళామందిరంలో ఈనెల 30వ తేదీ బుధవారం నుంచి మే 2వ తేదీ వరకు భగవద్ రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు వేడుకగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీభగవద్ రామానుజాచార్యులపై సాహితీ సదస్సు, సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం సాయంత్రం 5.30 గంటలకు తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి వారి మంగళ శాసనాలతో మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

మే11 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

నారాయణవనం : మండల కేంద్రంలోని పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మే 11వ తేదీ ఆదివారం నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకుడు శ్రీధరభట్టాచార్యులు తెలిపారు. ఉత్సవాలలో రెండు వేళలా వివిధ వాహనాలపై స్వామి వారు దర్శన భాగ్యం కల్పించనున్నారు. ఉదయం స్నపన తిరుమంజనం, సాయంత్రం గంట పాటు ఊంజల్‌సేవను నిర్వహించనున్నారు. నాగరాజు, శ్రీధరభట్టాచార్యులు విలేకరులతో మాట్లాడుతూ.. మే 11న ఆదివారం ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలలో స్వామి వారు చిన్నశేష వాహనంపై గ్రామోత్సవంలో పాల్గొంటారని అన్నారు. 12వతేదీ పెద్దశేష, హంస వాహనం, 13న సింహ, ముత్యపు పందిరి వాహనం, 14న కల్పవృక్ష, సర్వభూపాల వాహనం, 15 మోహినిగా, గరుడ వాహనంపై ఉత్సవర్లు ఊరేగుతారు. మే 16న ఉదయం హనుమంతవాహనం, సాయంత్రం వసంతోత్సవం, రాత్రి గజవాహనం, 17 సూర, చంద్రప్రభ వాహనాలపై స్వామి వారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. 18 ఆదివారం ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వవాహన సేవ, రాత్రి కల్యాణం నిర్వహిస్తారు. 19వ తేదీ ఉదయం పద్మ సరస్సులో చక్రస్నానం, సాయంత్రం ధ్వజారోహణంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాని వారు తెలిపారు.



కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం

ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీఓ

నాగలాపురం : పిచ్చాటూరు, కేవీబీపురం, నారాయణవనం మండలంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం పిచ్చాటూరు ఎంపీడీఓ కార్యాలయంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి, చక్కగా చదివి మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్ , తహసీల్దారు టి.వి.సుబ్రమణ్యం, ఎంపీడీఓ మహ్మద్ రఫీ, ఎంఈఓ హేమామాలిని, బాబయ్య, యుగంధర్ రాజు పాల్గొన్నారు.

● ఆశీర్వాదం



నాగలాపురం మండల కేంద్రంలోని స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో బీరకుప్పం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త భాస్కర్ కుమార్తె వివాహ కార్యక్రమానికి సత్యవేడు నియోజకవర్గ సమన్వయ కర్త నూకతోటి రాజేష్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

– నాగలాపురం

ఆదమరిస్తే ప్రమాదమే!



సర్కిల్ నుంచి రాంగ్ రూట్లో వెళ్తున్న వాహనాలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండలంలోని మల్లిగుంట సర్కిల్ నుంచి విమానాశ్రయానికి వెళ్లేందుకు సుమారు 500 మీటర్ల వరకు వన్ వేగా ఉంది. వాహనదారులు త్వరగా వెళ్లాలనే ఆత్రుతతో వన్‌వేలో రాంగ్ రూట్లో వాహనాలను నడుపుతున్నారు. ఇప్పటికే సర్కిల్లో అనేక ప్రమాదాలు జరిగి పలువురు దుర్మరణం చెందారు. మరి కొంత మంది ఆసుపత్రిపాలయ్యారు. వన్ వేగా ఉన్న రోడ్డులో కనీసం పోలీసులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు రాత్రి, పగలు అనే తేడా లేకుండా రాంగ్ రూట్లోనే వాహనాలను నడుపుతున్నారు. మరో ప్రమాదం సంభవించక ముందే సర్కిల్ నుంచి రాంగ్ రూట్లో వెళ్లే వాహనాలను అదుపు చేసే బాధ్యత పోలీసులపై ఉంది.

చెప్పుకోలేని బాధ!



సత్యవేడు ఎంపీడీఓ కార్యాలయంలో నిరుపయోగంగా మరుగుదొడ్డి

సత్యవేడు : ఇంటింటికీ మరుగుదొడ్డి నిర్మించుకోవాలంటూ అన్ని గ్రామాల్లో అధికారులు పర్యటిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. మరుగుదొడ్డి నిర్మించుకోకపోతే ప్రభుత్వం నుంచి అందే పథకాలు నిలిపివేస్తామని హెచ్చరిస్తుంటారు.. అలాంటిది మరుగుదొడ్లు నిర్మించుకోవాలని చెబుతున్న అధికారులు ఎంపీడీఓ కార్యాలయం, స్త్రీశక్తి భవనం, ఉపాధి హామీ భవనం, హౌసింగ్ కార్యాలయం, ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేక మహిళలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వందల సంఖ్యలో మహిళలు పలు సమస్యల పరిష్కారానికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో మండల ప్రజలకు ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో మరుగుదొడ్డి వసతి లేకపోవడంతో మహిళలకు ఇబ్బందులు తప్పడంలేదు.

మరమ్మతులు చేయిస్తాం

కార్యాలయ పరిధిలో మరుగుదొడ్డి మరమ్మతులకు గురైంది. త్వరలో మరమ్మతులు చేపట్టి కార్యాలయానికి వచ్చే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– చంద్రశేఖర్ ఎంపీడీఓ సత్యవేడు

భూముల రీసర్వే పారదర్శకంగా చేపట్టండి

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని తిమ్మభూపాలపురం గ్రామ రెవెన్యూలో రీసర్వే పారదర్శకంగా చేపట్టాలని ఆర్ఎస్ డీటీ చంద్రబాబునాయుడు తెలిపారు. మంగళవారం పార్లపల్లి గ్రామంలోని సచివాలయంలో రీ సర్వేపై సర్వేయర్లుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిమ్మభూపాలపురం గ్రామంలో 384.98 ఎకరాలు, చల్లమాంబపురంలో 265.55 ఎకరాల భూమి రీ సర్వే జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే రెండు గ్రామాల సరిహద్దులను గుర్తించి రాళ్లను ఏర్పాటు చేసి, సర్వేను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ రాజ్‌కుమార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న కేవీ రమణ

శ్రీకాళహస్తి : బాల్యవివాహాల నిర్మూలనకు అవగాహన కల్పిస్తున్నట్లు ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ పేర్కొన్నారు. మంగళవారం శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్‌లో మతపెద్దలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ.. జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ కోసం, బాల్యవివాహాల నిర్మూలన కోసం ప్రగతి స్వచ్ఛంద సంస్థ గత 20 ఏళ్లుగా కృషి చేస్తోందన్నారు. అక్షయ తృతీయ సందర్భంగా కొన్నిచోట్ల పెళ్లిళ్ల సీజన్‌గా పరిగణిస్తారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలను నిర్మూలించడానికి మతపెద్దలతో అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాజారెడ్డి, మండల కోఆర్డినేటర్ ప్రభాకర్, రాష్ట్ర యానాది సంఘం అధ్యక్షుడు చందమామల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

● 11 మందికి ఒక్కరే దిక్కు!



నాగలాపురం సచివాలయం-3లో విధుల్లో ఉన్న ఒకే ఒక్క ఉద్యోగి

నాగలాపురం సచివాలయం-3లో గతంలో 11 మంది సచివాలయ సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం ఒకరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న మిగతా సిబ్బంది బదిలీ అయ్యారు. వీరి స్థానంలో ప్రభుత్వం ఎవరిని నియమించకపోవడంతో ప్రస్తుతం ఒకే ఒక్క డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే దిక్కయ్యారు. అన్ని విభాగాలకు పూర్తి స్థాయిలో ఉద్యోగులు లేకపోవడంతో ప్రజలకు సకాలంలో సేవలు అందడం లేదని వాపోతున్నారు.

– నాగలాపురం

పడిలేస్తూ ప్రయాణాలు

- పెద్ద పాండూరు–తొండంబట్టు రోడ్డు ధ్వంసం
- ఏడాదిన్నరగా రోడ్డుకు మరమ్మతులు చేయని వైనం



కోతకు గురైన పెద్ద పాండూరు-తొండంబట్టు రోడ్డు



అధ్వాన్నంగా మారిన తారు రోడ్డు

వరదయ్యపాళెం : మండలంలోని పెద్ద పాండూరు నుంచి తొండంబట్టు మీదుగా సిద్దాపురం వరకు నిర్మించిన బీటీ రోడ్డు గతేడాదిన్నర కిందట కురిసిన వర్షాలకు ధ్వంసమైంది. పెద్ద పాండూరు రాళ్లకాలువ లోలెవల్ కాజ్‌వే నుంచి కుప్పట తాగేలి సమీపం వరకు 200 మీటర్లు పూర్తిగా ధ్వంసమైంది.

తారురోడ్డు కాస్త మెటల్ రోడ్డుగా మారిపోయింది. ఎన్నో ఏళ్లుగా ఈ మార్గానికి తారు రోడ్డు లేక ఆ ప్రాంత ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 10 గ్రామాల ప్రజలు ఆ ప్రాంత రోడ్డు నిర్మాణం కోసం అప్పటి స్థానిక ఎమ్మెల్యేకు విన్నవించారు. వారి విన్నపం మేరకు 5.5 కి.మీ బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3.75 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు పూర్తి చేసి రెండేళ్ల కిందట ఎమ్మెల్యే చేతుల మీదుగా రోడ్డును ప్రారంభించి ఆ ప్రాంత ప్రజల రాకపోకలు సుగుమం చేశారు. అయితే వర్షాలకు రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో మళ్లీ ఆ ప్రాంత ప్రజల వాహన రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితులు పునరావృతమయ్యాయి. రోడ్డుకు ఓ వైపు రాళ్లవాగు ప్రవహిస్తుండడంతో భారీ వర్షాలకు రోడ్డుపైకి వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డుపై ఉన్న తారు లేయర్ పూర్తిగా కొట్టుకుపోయింది. మళ్లీ ఆరు నెలల కిందట కురిసిన వర్షాలకు ఈ రోడ్డు ఇంకాస్త ధ్వంసమై రాకపోకలకు మరింత దారుణంగా తయారైంది. ప్రభుత్వం స్పందించి వరద నష్టం కింద నిధులు మంజూరు చేసి తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.